సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 19 । నవంబర్ । 2023




సమాజ స్థితిగతులు తెలుసుకునేందుకే కులగణన - 10లో

సమాజంలోని వివిధ వర్గాల స్థితిగతులను తెలుసుకునేందుకే ప్రభుత్వం కులగణన చేపడుతోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.



చెరకుతోట దగ్ధం - 10లో

రేగిడి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో చెరకు తోటలు దగ్ధమయ్యాయి.



మందలించాడని మట్టుబెట్టేశాడు

స్క్రాప్ షాపులో ఉన్న వస్తువులను దొంగలించవద్దని మందలించినందుకు వాచ్‌మన్‌ను అతి దారుణంగా చంపేశాడు. - 10లో

న్యూస్‌రీల్

పెన్సిల్ మొనపై క్రికెట్ వరల్డ్ కప్



కొత్తవలస: మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ జి.ఎం.జి.పరమేశ్వరరావు పెన్సిల్ మొనపై క్రికెట్ వరల్డ్ కప్‌ను చెక్కి అబ్బుర పర్చారు. వరల్డ్‌కప్‌ను భారత్ సాధించాలనే సంకల్పంతో మూడు గంటలు శ్రమించి వరల్డ్ కప్‌ను చెక్కినట్టు తెలిపారు. ఆయనను పాఠశాల హెచ్‌ఎం సునీత, ఇతర బోధనా సిబ్బంది అభినందించారు.

మాదలింగిలో ఏనుగుల సంచారం



మాదలింగి నుంచి కురుపాం వెళ్లే రోడ్డులో హల్‌చల్ చేస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: మండలంలోని మాదలింగి నుంచి కురుపాం వెళ్లేదారిలో ఏనుగుల గుంపు శనివారం సంచరించింది. రోడ్డు పక్కన ఉన్న పామాయిల్‌తోటలో తిష్టావేశాయి. కురుపాం వైపు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. ఒంటరి ఏనుగు జాడ గత పది రోజులుగా తెలియడం లేదని, ఒడిశావైపు వెళ్లి ఉంటుందని అటవీశాఖ సిబ్బంది భావిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై మృతుడు పంచాది కృష్ణ

పార్వతీపురం టౌన్: రైలు ఢీకొనడతో పార్వతీపురం పట్టణం కొత్తవలసలో కొత్త వీధికి చెందిన పంచాది కృష్ణ(61) మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్ ఫారమ్ సమీపంలో మృతదేహం ఉందని రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి పరిశీలించి మృతుడిని గుర్తించారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి రెండవ నంబర్ ప్లాట్ ఫామ్‌కు వెళ్తుండగా రైలు ఢీకొన్నట్టు అనుమానిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ...



జిల్లా ఆస్పత్రిలో హరిబాబు మృతదేహం

పార్వతీపురం టౌన్: కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన ఊయక హరిబాబు(28) తన భార్యను కొట్టిన క్రమంలో తీవ్ర మనస్తాపం చెందాడు. శుక్రవారం పురుగుల మందును సేవించి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు తొలుత నీలకంఠాపురం పీహెచ్‌సీలో వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి శనివారం తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యసేవలు పొందుతూ హరిబాబు మరణించారు. ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

మన్యంను ముందంజలో నిలిపేలా..
చదువు ప్రణాళిక

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించేందుకు ప్రత్యేక అధికారుల నియామకం
- జిల్లాలోని 182 మందికి ఉన్నత పాఠశాలల బాధ్యతలు అప్పగింత
- ప్రతి వారం పాఠశాలల సందర్శన
- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా తర్ఫీదు

పార్వతీపురం టౌన్:

పార్వతీపురం మన్యం జిల్లాలో చదువుల క్రతువు నిర్విఘ్నంగా సాగుతోంది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో 87.47శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది శతశాతం ఫలితాల సాధనతో పాటు అధికమంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించేలా చక్కని బోధన ప్రణాళికను విద్యాశాఖ అధికారులు అమలుచేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించేందుకు, ఉన్నత పాఠశాలల సందర్శనకు మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులందరూ విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి వారం తమకు దత్తత ఇచ్చిన పాఠశాలను పర్యవేక్షిస్తున్నారు. అక్కడి బోధన తీరు, విద్యార్థుల అభ్యసన, లోటుపాట్లను గుర్తించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. మన్యంలో చదువుల విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.



పార్వతీపురం జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల సందర్శనలో ఎంఈఓ విమలాకుమారి (ఫైల్)

డీవీఎంఎం స్కూల్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

పార్వతీపురం పట్టణం డాక్టర్ డీవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారిగా కలెక్టర్ నిషాంత్ కుమార్, పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, మక్కువ మండలం వై.ఎస్.వలస, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల ప్రత్యేకాధికారిగా ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ వ్యవహరించనున్నారు.



బలిజిపేట మండలం చిలకలపల్లి పాఠశాలలో నోట్‌బుక్‌లు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి బి.శ్రీనివాసరావు(ఫైల్)

182 మంది ప్రత్యేక అధికారుల నియామకం

జిల్లాలోని 182 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు 182 మందిని కలెక్టర్ నియమించారు. ఈ సంవత్సరాంతపు పరీక్షలు పూర్తయ్యేవరకు ఏడు రోజులకోసారి కేటాయించిన పాఠశాలలను సంబంధిత ప్రత్యేకాధికారులు సందర్శిస్తారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తారు. వారు ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులతో చర్చించి వాటిని అమలుచేస్తారు. ప్రతి విద్యార్థి పదోతరగతి ఉత్తీర్ణుడై ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఆత్మస్థైర్యం నింపుతున్నారు.

జిల్లాలో మండలాల వారీగా పాఠశాలలకు ప్రత్యేక అధికారుల నియామకం ఇలా...

మండలం	నియమించిన ప్రత్యేకాధికారులు
బలిజిపేట	10
భామిని	7
గుమ్మలక్ష్మీపురం	13
గరుగుబిల్లి	10
జియ్యమ్మవలస	13
కొమరాడ	13
కురుపాం	15
మక్కువ	7
పాచిపెంట	10
పాలకొండ	9
పార్వతీపురం	18
సాలూరు	19
సీతంపేట	17
సీతానగరం	9
వీరఘట్టం	12

ప్రమాణాలతో కూడిన విద్య



ప్రతి పాఠశాలలో ప్రమాణాలతో కూడిన విద్యను బోధించేలా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాలు పెంచడం, బోధనలో నూతన పద్ధతులు అవలంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం. ఈ ఏడాది అధికారుల పర్యవేక్షణతో బోధన ప్రణాళిక చక్కగా అమలవుతోంది. మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. - నిషాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

కన్సల్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: వైద్య, ఆరోగ్య శాఖలో క్వాలిటీ మోనటరింగ్ విభాగంలో జిల్లా కన్సల్టెంట్ పోస్టును కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై భర్తీచేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు నమూనా, అర్హతల వివరాలు హెచ్‌టీటీపీఎస్ పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు పార్వతీపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పోరాటాలతో గిరిజన హక్కుల సాధన



రైతు కూలీ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

- రైతు కూలీ సంఘం భవనాన్ని ప్రారంభించిన రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

మక్కువ: పోరాటాలతోనే గిరిజన హక్కుల సాధన సాధ్యమని రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పేర్కొన్నారు. దుగ్గేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆదివాసీ భవన్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలందరి కష్టంతో నిర్మించిన భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే నూతన అటవీ సంరక్షణ చట్టాలు-2023కు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆదివాసీ భవన్ నుంచి ర్యాలీగా మార్కెట్ యార్డ్ వరకు వెళ్లి జన్ని తిరుపతి వర్ధంతి సభను రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి దండులూరి వర్మ మాట్లాడుతూ జెన్ని తిరుపతి అమరుడై నేటికి 24 సంవత్సరాలు కావస్తున్నా ఆయన నేటికీ మనతోనే ఉన్నట్టు అనిపిస్తోందన్నారు. ఆయన ఉద్యమం స్ఫూర్తిదాయకమైనదన్నారు. గిరిజనులందరూ జీవన స్థితిగతులను మెరుగుపరచుకోవాలన్నారు. రైతు కూలీ సంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ మాట్లాడుతూ ఇప్పటివరకు మనం చేసిన పోరాటాలతోనే అంత అయిపోలేదని, మనం సాధించుకున్నది కొంతేనని, సాధించుకోవాల్సింది చాలా ఉందన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసి గిరిజనులకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ(న్యూ) నాయకుడు బెహరా శంకరరావు, కొండ మొదలు పంచాయతీ సర్పంచ్ వి.విజయ, పి.శ్రీను నాయుడు, ఎం.భాస్కర్‌రావు, పి.అసిరి, ఎమ్.చెంచు తదితరులు పాల్గొన్నారు. నృత్యప్రదర్శనలతో కళాకారులు అలరించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: వచ్చే ఏడాది జరగనున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ సూచించారు. పట్టణంలోని కేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పార్వతీపురం డివిజన్ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో శనివారం నిర్వహించిన అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచాలన్నారు. ప్రతి విద్యార్థి అధికమార్కులు సాధించేలా పాఠ్యాంశబోధన సాగాలన్నారు. జిల్లాలోని 182 ఉన్నత పాఠశాలల పర్యవేక్షణకు మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులను నియమిస్తూ కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ జి.నారాయణస్వామి, ఏఎంఓ సీహెచ్ శ్రీనివాసరావు, కె.జనార్దన, రమణమూర్తి, విమలా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ
బడిలోనే ఉండాలి

- జిల్లాలో 3,750 మంది పిల్లలు బడిబయట ఉన్నారు
- ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ మధుకిశోర్



వీరఘట్టం ఎంఈఓ ఆనందరావుతో మాట్లాడుతున్న ప్రత్యామ్నాయ పాఠశాలల కో-ఆర్డినేటర్లు

వీరఘట్టం: చైల్డ్ ఇన్‌ఫో ప్రకారం బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కో-ఆర్డినేటర్ ఎన్.మధుకిశోర్ అన్నారు. వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయానికి విచ్చేసిన ఆయన విలేకర్లతో శనివారం మాట్లాడారు. ఈ ఏడాది జూలై నాటికి జిల్లా వ్యాప్తంగా 12 వేల మంది బడి బయట ఉండేవారని, ఇప్పుడా సంఖ్య 3,750కు తగ్గిందన్నారు. కొంతమంది పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయిన వారు బయట ఊళ్లలో ఉంటున్నట్టు గుర్తించామని తెలిపారు. ప్రతి విద్యార్థి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్టు వెల్లడించారు. వీరఘట్టం మండలంలో డ్రాపౌట్స్‌పై ఎంఈఓ ఆర్.ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మరో కో-ఆర్డినేటర్ బి.అప్పలనాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

స్కేటింగ్‌లో రాణించిన హాసిని



స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన హాసిని

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన రోలార్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన పొన్నాడ హాసిని పతకాల పంట పండించింది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 35వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో 11-14 సంవత్సరాల వయస్సుగల బాలికల విభాగంలో పాల్గొన్న హాసిని రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించి వచ్చేనెల చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అక్టోబర్ నెలలో పూణే జరిగిన 52వ కేంద్రీయ విద్యాలయ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని 1 సిల్వర్ మెడల్, 1 బ్రాంజ్ మెడల్ సాధించింది. ఇప్పటి వరకు 5 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో తలపడిన హాసినిని కోచ్ రాజు, క్రీడాధికారులు అభినందించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

విజయనగరం: గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న సబ్‌జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించే 34 మంది క్రీడాకారులు పయనమయ్యారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు యశస్విని, గగన్, చైతన్య అభినందనలు తెలిపారు. విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

క్రీడాకారిణికి నగదు బహుమతి



కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న క్రీడాకారిణి మౌనిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఐదో ప్రపంచకప్ టెన్నీకాయిట్ పోటీల్లో విజేతగా నిలిచిన గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన రెడ్డి మౌనికకు కలెక్టర్ కార్యాలయంలో రూ.25వేల నగదు బహుమతిని కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కోరాడ ప్రభావతి శనివారం అందజేశారు. సౌత్ ఆఫ్రికాలోని విక్టోరియాలో సెప్టెంబర్-30 నుంచి అక్టోబర్-7 వరకు జరిగిన టెన్నికాయిట్ పోటీల్లో సింగిల్స్‌లో మౌనిక స్వర్ణపతకం, డబుల్స్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. విజయాన్ని అభినందిస్తూ ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ సభ్యులు కోచ్ ఎం.రామారావు, ఎం.శ్రీనివాసరావు, శివప్రసాద్, గౌరీశంకర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా



రోడ్డుపై అడ్డంగా పడిన బొగ్గులారీ

రాజాం సిటీ: రాజాంలోని బొబ్బిలి కూడలిలో శనివారం తెల్లవారు జామున బొగ్గులోడుతో వస్తున్న లారీ బోల్తాపడింది. రామభద్రాపురం వైపు నుంచి వస్తున్న లారీ బొబ్బిలి కూడలి నుంచి శ్రీకాకుళం రోడ్డు వైపు తిరిగే క్రమంలో అదుపుతప్పి బోల్తాకొట్టింది. పోలీసులు ఘటనా స్థలంలోని బొగ్గును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా చేశారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె నోటీస్

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీన సమ్మె చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరి, పైడిరాజు తెలిపారు. ఈమేరకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి. శాంతకుమారిని శనివారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

సమాజ స్థితిగతులు తెలుసుకునేందుకే

కులగణన

- జిల్లా స్థాయి సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి
- చరిత్రాత్మక నిర్ణయమన్న వివిధ వర్గాల ప్రతినిధులు





జిల్లా స్థాయి సదస్సుకు హాజరైన వివిధ సంఘాల ప్రతినిధులు, (ఇన్‌సెట్‌లో) సదస్సునుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: సమాజంలోని వివిధ వర్గాల స్థితిగతులను తెలుసుకునేందుకే ప్రభుత్వం కులగణన చేపడుతోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కులగణన-2023పై వివిధ కుల సంఘాలు, సంస్థల అభిప్రాయాలను తెలుసుకునేందుకు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి జిల్లాలో అత్యంత పారదర్శకంగా కులగణన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. దీనిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారం రోజులపాటు మూడు విధాలైన వివరాల సేకరణకు సర్వే చేస్తారన్నారు. అన్నికుటుంబాల వారు సహకరించాలని సూచించారు. వివరాలను తెలిపిన తరువాత కుటుంబానికి చెందిన ఎవరో ఒక వ్యక్తి వాటిని నిర్ధారిస్తూ బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. సేకరించిన వివరాలు గోప్యంగా భద్రంగా ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకోవడం శుభకరమన్నారు. కులగణనతో ఆయా వర్గాల జనాభాను బట్టి సంక్షేమ పథకాల అమలుకు అవకాశం కలుగుతుందన్నారు. కులసంఘాలన్నీ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సదస్సులో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి.అనిత, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి జి.బాలాజీ, జిల్లా బీసీ సంక్షేమాధికారి సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి నిర్మలాదేవి, సంక్షేమశాఖ అధికారులు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కులగణన ప్రక్రియ చరిత్రాత్మకమైనదని రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూషాపట్నాయక్ తదితరులు కొనియాడారు. ఇప్పటికే వివిధ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఈ సర్వేతో ఆయా వర్గాలకు మరింత ప్రయోజనాన్ని చేకూర్చనున్నారని చెప్పారు. సమావేశంలో వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



మహంతి బాలకృష్ణ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జె.ఆర్.పురం ఎస్సై రాజేష్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం ఏపీటోరియా (అరబిందో) పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న ఎలక్ట్రీషియన్ మహంతి బాలకృష్ణ(34) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. స్థానిక కార్మికులు, సీఐటీయూ నాయకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీటోరియా పరిశ్రమలోని కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ శనివారం ఉదయం 9 గంటలకు జనరల్ షిఫ్ట్‌కు వెళ్లాడు. పెన్సిలిన్ ప్లాంట్ ప్రొడక్షన్ బ్లాక్-1లో బ్లూవేర్ రూంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు, యాజమాన్యం సహకారంతో పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శవపంచనామా నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం రెల్లివలస. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. కార్మికుడి కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలని పరిశ్రమ యాజమాన్యాన్ని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోలార్ పంపు సెట్ చోరీ

భామిని: మండల కేంద్రానికి చెందిన రైతు రఘునాథ్ సాంత్రోకు చెందిన పొలంలోని సోలార్ బోరు మోటారు, బోర్డు చోరీకి గురైంది. భామిని-లివిరి గ్రామాల మధ్యన పొలాల్లో తరచూ బోర్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు నిఘావేసి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ- ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



యాళ్ల కిరణ్ (ఫైల్)



ప్రమాద స్థలంలో కిరణ్ మృతదేహం

గరుగుబిల్లి: గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రావివలసకు చెందిన యాళ్ల కిరణ్ (30) తన స్నేహితుడు గంట నరేష్ కలిసి బైక్‌పై రావివలస నుంచి పార్వతీపురం వెళ్తుండగా, పాలకొండవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ కిందపడిపోయారు. బైక్ నడుపుతున్న కిరణ్ తలపై నుంచి గుర్తుతెయని వాహనం వెనుక టైర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను చికిత్స కోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. పరిస్థితులు సహకరించక పోవడంతో స్వగ్రామానికి వచ్చి ఆటోను నడుపుతూ జీవనం సాగించాడు. అది కూడా గిట్టుబాటు కాకపోవడంతో ఫైనాన్స్‌కు అప్పగించాడు. బొబ్బిలిలోని జూట్ కంపెనీలో చేరేందుకు వెళ్తుండగా ప్రమాదానికి గురై మృత్యు ఒడికి చేరాడు. తల్లిదండ్రులు అప్పలనాయుడు, రమణమ్మతోపాటు భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు.

వాహనం కోసం గాలింపు

ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు వీరఘట్టం, పాలకొండ పోలీసులకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. వాహనాన్ని అదుపులోకి తీసుకొనేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

మందలించాడని మట్టుబెట్టేశాడు

- హత్యకు గురైన వాచ్‌మన్
- గునపంతో అడ్డగా తలపై మోది, కిరాతకంగా చంపేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు



మృతుడు బంటుపల్లి అప్పలనాయుడు (ఫైల్)





హత్య జరిగిన స్క్రాప్ షాప్ ఇదే..(ఇన్‌సెట్లో) మృతిచెందిన అప్పల నాయుడు

విజయనగరం క్రైమ్:

స్క్రాప్ షాపులో ఉన్న వస్తువులను దొంగలించవద్దని మందలించినందుకు వాచ్‌మన్‌ను అతి దారుణంగా చంపేశాడు. మద్యం మత్తులో గునపంతో తలపై మోది, ఛిద్రం చేశాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇండస్ట్రియల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వీటీ అగ్రహారానికి చెందిన బంటుపల్లి అప్పలనాయుడు (61) కొన్నేళ్లుగా ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఓ స్క్రాప్ షాపులో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే షాపులో బీహార్ నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. వారిలో ఒకడైన మంజి కునాల్ జల్సాలకు డబ్బులు సరిపడకపోవడంతో షాపు నుంచి స్క్రాప్ సామగ్రిని దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా వాచ్‌మన్ అప్పలనాయుడు మందలించాడు. దీంతో కునాల్ వృద్ధుడిపై చేయిచేసుకున్నాడు. అది చూసిన కూలీలు అతనిని నిలువరించారు. చంపేస్తానని బెదిరిస్తూ కునాల్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. వృద్ధుడి భార్య, కుమారుడు అక్కడకు వచ్చి ఇంటికి వెళ్లిపోదామని చెప్పారు. తగాదా ఏమీ ఉండదనుకుని వృద్ధుడు షాప్ షెట్టర్ తాళం వేసుకుని లోపల మడత మంచంపై పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పూర్తిగా మద్యం సేవించి వచ్చిన కునాల్ గోడదూకి లోపలకు వెళ్లాడు. అక్కడ ఉన్న గునపంతో వాచ్‌మన్‌పై దాడిచేసి తల ఛిద్రమయ్యేలా మోదాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ తర్వాత కునాల్ అక్కడ నుంచి పరారయ్యాడు. శనివారం ఉదయం తోటి వాచ్‌మన్‌లు అప్పలనాయుడుని టీకి పంపించాలని పిలిచారు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో సందేహం వచ్చి అందులో ఒకరు గోడదూకి చూసేసరికి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే మృతుడి భార్య యశోద, కుమారుడు తరుణ్‌కు విషయం తెలియజేశారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కునాల్‌ను రాత్రి తగాదాలో నువ్వే చంపేశావా అని అక్కడ పనిచేసిన కూలీలు ప్రశ్నించడంతో తనకేమీ తెలియదంటూ మెల్లగా జారుకున్నాడు. కొంతసేపటి తర్వాత వాడే హత్యచేసి ఉంటాడని అనుమానం వచ్చిన స్థానికులు అతని గదికి వెళ్లేసరికి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలను సేకరించింది. రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు, ఎస్ఐ గణేష్ రెండు బృందాలుగా విడిపోయి నిందితుడి కోసం గాలించారు. నిందితుడు విజయనగరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా ఎస్ఐ బృందం అదుపులోకి తీసుకుంది.

చెరకుతోట దగ్ధం



వెంకటాపురంలో కాలిపోతున్న చెరకు పంట

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

రేగిడి: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో చెరకు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బాన్న ఆనందరావు చెరకు పొలంపై నుంచి 33కేవీ విద్యుత్‌లైన్ ఉంది. విద్యుత్ వైర్లు తెగి పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఆనందరావుకు చెందిన ఎకరా 80 సెంట్లు, కింజరాపు భాస్కరరావుకు చెందిన 60 సెంట్లు విస్తీర్ణంలోని చెరకు పంట కాలిబూడిదైంది.

పోలినాటి వెలమ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్ అందించిన సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. ఇద్దరు రైతులకు చెందిన పంట విలువ రూ.5 లక్షలు ఉంటుందని అంచనావేస్తున్నారు. చేతికందిన పంట కాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలి

విజయనగరం అర్బన్: ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని ఎన్ఎంయూఏ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్ఎంయూఏ కార్మికులపై యాజమాన్యం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇటీవల ఒక మహిళా కండెక్టర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. చిన్న, చిన్న విషయాలకు కూడా సస్పెండ్ చేస్తున్న డిపో మేనేజర్ వైఖరి మారాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫిల్, డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, అధ్యక్షుడు వి.రామారావు, జీవీఎం శ్రీనివాస్, సరిత, బీఎల్‌వీ కుమారి, పీవీటీ రావు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు నమోదు

భోగాపురం: ఓటరు నమోదు కార్యక్రమం పక్కగా నిర్వహించాలని నియోజకవర్గ ఈఆర్ఓ నూకరాజు సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటర్ల నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు లేకుండా చూడాలని.. చిరునామాలో మార్పులు, చేర్పులుంటే చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బంగార్రాజు, డీటీ శ్రీనివాస్, బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లెండీకి జాతీయ స్థాయి గుర్తింపు



గోవాలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న లెండి ప్రిన్సిపాల్ వి.వి.రామారెడ్డి

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండీ ఇంజినీరింగ్ కళాశాల అఖిలభారత విద్యామండలి ఎడ్యుస్కిల్స్ ఇంటర్న్‌షిప్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంజినీరింగ్ విద్యలో ప్రయోగాత్మక విద్యాభ్యాసం, విద్యార్థుల్లో సాంకేతిక నిపుణతను పెంపొందించే దిశగా వివిధ కంపెనీల భాగస్వామ్యంతో ఏటా ఎడ్యుస్కిల్స్ జాతీయస్థాయిలో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తుంది. 2022-23 విద్యా సంవత్సరానికి మైక్రోచిప్, ఏడబ్ల్యూఎస్, అల్ట్రాక్స్, సెలోనిస్, పాలోఆల్టో కంపెనీలలో నెల్వర్క్, క్లౌడ్‌కంప్యూటింగ్, ప్రాసెస్ మైనింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీలలో 1857 మంది విద్యార్థులు చేసిన ఇంటర్న్‌షిప్‌లకు జాతీయ స్థాయిలో బెస్ట్ పెర్‌ఫార్మర్ ఇనిస్టిట్యూట్ విభాగంలో లెండి కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని సంస్థ సెక్రెటరీ, కరస్పాండెంట్ కోడూరి శివరామకృష్ణ, ప్లేస్‌మెంట్ డీన్ ప్రకాష్‌బాబు తెలిపారు. గోవాలో జరిగిన కార్యక్రమంలో గోవా సీఎం ప్రమోద్‌సావంత్, అఖిలభారత విద్యామండలి చైర్మన్ టి.జి.సీతారామన్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు పి.జె.జగన్నాథం పాల్గొన్నారు.

సిరిపురం విద్యార్థుల క్రీడా ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వై.యోచన, ఎ.ఢిల్లీశ్వరరావు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికై నట్టు హెచ్ఎం వి.వెంకటరావు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, పీడీలను ఉపాధ్యాయ బృందం అభినందించింది.